# హింస

**మా** కుటుంబాలలో పిల్లల్ని పెంచటానికి రెండే పద్ధతులు. పిల్లల్ని చావగొట్టి చెవులుమూసి చెప్పినమాట వినేటట్టు చేయటమూ, లేకపోతే వాళ్ళని గారాబం చేసి వాళ్ళు ఆడినట్టు ఆడటమూ... ఒకటి సన్మార్గమూ, రెండోది దుర్మార్గమూను. కొందరికి రెండూ దుర్మార్గాలే అనిపించవచ్చు. అది వేరే విషయం. మరో పద్ధతిలో పిల్లల్ని పెంచటం సాధ్యమని మేం మటుకు ఒప్పుకోం. ఎక్కడైనా, ఎవరైనా పరాయివాళ్ళ పిల్లలు మా పిల్లలల్లే కాకుండా తల్లిదండ్రుల ప్రేమకు పాత్రులవుతూకూడా, తల్లిదండ్రులు చెప్పే మాటలను విశ్వసిస్తూ వాళ్ళు వద్దన్న పనులు మానటం మా అనుభవంలోకి వస్తే, అది ఆ తల్లిదండ్రుల పురాకృత పుణ్యమంటాం. "పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు" అనుకుంటాం. మాకటువంటి పిల్లలు పుట్టరు. మాకు పుట్టేవాళ్ళు చూస్తూ చూస్తూ మా మాట వినరు. మేం పూర్వజన్మలో చేసిన దానం అటువంటిది! అంచేత మేం వాళ్ళని క్రమశిక్షణలో పెంచుతాం. వాళ్ళ బాగుకోసమే వాళ్ళని కొడతాం. మేం కొట్టకుండానే వాళ్లు భయభక్తులు కలిగివుంటే ఇక కావలసిందేమిటి? కాని అంత అదృష్టం మాకు రాసిపెట్టి ఉంటేగా? పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచలేకపోతే వాళ్ళని పాడుచేస్తాం. అపేక్ష అని పేరుపెట్టి వాళ్ళను పడేసి నాకుతాం. అది మా దౌర్బల్యం. అందుకనే అట్లా పెరిగిన పిల్లలు మాటవినరు. మాకు ఎదురు తిరుగుతారు. చిన్నతనంలో పిల్లల్ని హద్దులో ఉంచలేకపోయినందుకు వాళ్ళు పెద్దయినాక తలవంచుకు తిరగవలసి వస్తుంది. మొక్కై వంగనిది మానై వంగుతుందా ఏమిటి?

❀ ❀ ❀ ❀ ❀

కిష్టుడు చిన్నప్పటినుంచీ చాలా భయభక్తులతో పెరిగినవాడు. ఎందుకు పెరగడూ? మహాలక్ష్మమ్మగారు ఆరుగురు పిల్లల్ని కన్నది. ఆరుగురూ ఆరుగురే. నవరత్నాలు. ఎన్నడూ తలిదండ్రులమాట జవదాటి ఎరుగరు. పెద్ద మొగపిల్లలిద్దరూ పెళ్ళయిన తరవాత అత్తవారి వలలోపడి తల్లిదండ్రులకు దూరమైనారుగాని, పెళ్ళయ్యే వరకూ ఎంతభయభక్తులతో పెరిగారు! తరవాత ఆడపిల్లలిద్దరూ మొగుళ్ళ దగ్గిర భయభక్తులతో కాపరాలు చేస్తున్నారు.

కిష్టుడూ, కడగొట్టు పిల్లదీ ఉన్నారు. అందరు పిల్లల్ని ఆదర్శంగానే పెంచిన మా లక్ష్మమ్మ పెద్ద పిల్లలు అట్లా దూరమైనాక కిష్టుణ్ణి ఇంకా శ్రద్ధగా పెంచింది. వాణ్ణి ఎవరి సావాసమూ చెయ్యనిచ్చేదికాదు. వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉండేది. అన్నం తూచినట్లు పెట్టేది. ఆకలి అయినా కాకపోయినా గడియారం ప్రకారం పెట్టేది. వాడు తిండి సరిగా తినకపోతే మొట్టి తినిపించేది. ఇంకా కావాలంటే నాలికి పీక్కు చచ్చినా పెట్టేదికాదు. ఆవిడ అంత శ్రద్ధగా పెంచినా కిష్టుడు రోగిష్టిగానే వుండేవాడు. వాడికి నరాలజబ్బు వుందని డాక్టర్లు చెప్పారు. డబ్బు గుంజటానికి ఈ డాక్టర్లు ఏమైనా చెబుతారు. అందుకనే వాడికి పదిరోజులకోసారి జబ్బు చేస్తే నాటువైద్యుణ్ణి పిలిపించేది మాలక్ష్మమ్మ. ఇక ఆ నరసింహంగారి మాట చెప్పనే అక్కర్లేదు. ఆయన హుంకరిస్తే కిష్టుడు లాగులో ఉచ్చపోసుకునేవాడు. తండ్రి నడవలోకివస్తే వాడు దొడ్లో వుండేవాడన్నమాట.

❁ ❁ ❁ ❁ ❁

మా లక్ష్మమ్మ పిల్లల్ని పెంచటం విషయంలోనేకాక, అన్ని విషయాలలోనూ అద్భుతమైన నియమాలుకలది. ఆవిడ ఏ జంతువునూ హింసించేదికాదు. వాళ్ళింటోకి తేళ్ళువస్తే వాటిని వుపాయంగా పట్టుకుని, దారంకట్టి కత్తెరతో కొండె కత్తిరించి, కత్తెర తోమి, కడిగి, తేళ్ళను వదిలిపెట్టేది. మరోసారి వాళ్ళ ఇంటినిండా నల్లులు పుట్టలు పుట్టలుగా బయలుదేరినై. ఆవిడ నల్లిని కూడా ఎన్నడూ చంపేదికాదు. నల్లులు పోవటానికి ఎవరో మంచి ఉపాయం చెప్పారు. ఆవిడ ఒక పెద్ద కాగితం సంపాదించి కిష్టుడిచేత దానిమీద, చివర "రు" అనే అక్షరం వచ్చే ఊళ్ళపేర్లన్నీ – కోడూరు, గూడూరు, నెల్లూరు మొదలైనవి రాయించి, ఆ కాగితం చుట్టగాచుట్టి ఇంటి కప్పుకు వేళ్ళాడగట్టింది. ఆనాటినుంచీ ఆవిడను నల్లి కుట్టి ఎరగదు. రాత్రి పడుకుంటే భళ్లున తెల్లవారేదాకా మెళకువ వచ్చేదికాదు.

"నీ మొహమల్లేనే వుంది! తెల్లవార్లూ నన్ను నల్లులు చెడపీకినై" అన్నాడు నరసింహంగారు.

"మీ భ్రమ, ఇంకా నల్లి ఎక్కడ కుడుతుంది?" అన్నది మాలక్ష్మమ్మ.

"నాపక్కనిండా పాకితేనే?"

"పాకుతై, కుట్టవు" అన్నది మాలక్ష్మమ్మ.

అటువంటి మాలక్ష్మమ్మ పెంపకంలో పెరిగాడేమో, కిష్టుడు కించిత్తయినా జీవహింస సహించేవాడు కాదు. వాడు కాకుల్ని, పిచ్చికల్ని, పిల్లుల్నీ, కుక్కల్నీ వీలయినప్పుడల్లా మేపేవాడు.

ఈ విషయమై వాణ్ణి తల్లి కోప్పడవలసి కూడా వచ్చింది.

"కాకి ఆకలై అరుస్తే కొంచెం చద్దన్నం పెట్టానమ్మా" అన్నాడు కిష్టుడు భయంతో పిచ్చి మొహంవేసి.

"కాకి ఆకలి వెయ్యకపోయినా అరుస్తుంది. కాకుల్నీ, పక్షుల్నీ చూసి జాలిపడాలిగాని, అన్నం వేస్తూ కూచుంటారుట్రా?" అన్నది తల్లి.

ఈ గుణపాఠాన్ని అర్థం చేసుకోవటానికి కిష్టుడు ప్రయత్నించాడు.

వాడికి అన్ని జంతువులమీదా జాలివుందిగాని, బల్లులమీద మటుకు లేదు. వాడు రోజూ గోడమీద బల్లులు పురుగుల్ని వేటాడటం చూసేవాడు. ఒకరోజు వాడు చూస్తుండగా బల్లి ఒకటి పోతంత రెక్కల పురుగును పట్టుకుంది. కిష్టుడది చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. కాస్సేపటికి వాడు కళ్ళు తెరచి చూస్తే బల్లి ఉంది గాని, రెక్కలపురుగు దానినోట్లో లేదు. కిష్టుడి హృదయం ఆనందంతో పొంగి పోయింది. రెక్కలపురుగు బల్లినోట్లోపడి తప్పించుకు పోయిందనుకున్నాడు.

మరోసారి కిష్టుడు చూస్తుండగానే పిల్లి ఒకటి ఎలకని పట్టుకుంది. ఆ సమయంలో కిష్టుడు అన్నం తింటున్నాడు. పిల్లి లోపలికి వచ్చింది. దాని వాలకం చూస్తే ఏదోపెద్ద పనిమీద ఉన్నట్టు కనపడ్డది. మాలక్ష్మమ్మ "ఛీ! ఛీ!" అంది. అది వినిపించుకోలేదు. మూల ఉన్న బుట్టను పంజాతో గీరసాగింది. కాస్సేపటికి అది అమాంతం దేనిమీదనో పడి దాన్ని నోట కరుచుకుని బయటికి వెళ్ళిపోయింది. కిష్టుడి కళ్ళకేదో మైకం కమ్మినట్టయి, పిల్లినోట ఉన్న ఎలిక వాడికి కనిపించలేదు.

"ఎంత ఎలికో!" అన్నది తల్లి.

కిష్టుడికి అన్నం సహించలేదు. తల్లి మొట్టికాయలతో వాడిచేత అన్నం తినిపించింది.

ఆ రోజునుంచీ వాడికి పిల్లులమీద జాలిపోయింది.

❀ ❀ ❀ ❀ ❀

కామయ్యగారి ఇంటో ఒక కుక్క ఉండేది. దానికెప్పుడన్నా వాళ్ళు అన్నం పెట్టేవాళ్ళు. కిష్టుడికి ఈ కుక్క అంటే ప్రాణం. "కస్తూరీ" అని పిలిస్తే, అది తోకాడించుకుంటూ వాడి దగ్గరికి వచ్చేది. దాన్ని ముట్టుకుంటే ఒకప్పుడు చూసినంత మాత్రం చేతనే, కిష్టుడి హృదయంలో ఏదో బిగబట్టి నట్టయేది. దాన్ని గట్టిగా గుండెకు అదుముకుని ఎప్పటికీ వదలకుండా ఉండాలనిపించేది. కుక్కల్ని మనుషులు ముద్దు పెట్టుకోరని కిష్టుడికి తెలుసు కాబట్టి సరిపోయింది. కాని లేకపోతే వాడు దాన్ని ఎవరూ చూడకుండా ముద్దులు కూడా పెట్టుకునేవాడేమో.

కస్తూరికి కిష్టుడు తన చేతిమీదుగా ఎన్నడూ ఏమీ పెట్టలేదు. కాని అది

ముఖ్యంకాదు. దానిమీద వాడికి చాలా జాలి. పాపం, దానికి కడుపులో నొప్పివస్తే ఎవరితోనూ చెప్పలేదుకద! ఆకలయితే అన్నం పెట్టమని అడగటానికి దానికి అమ్మలేదుకద! ఇటువంటి ఆలోచనలు రాగానే కిష్టుడికి పొర్లి పొర్లి ఏడుపు వచ్చేది.

ఒకసారి కస్తూరి నాలుగు పిల్లల్ని పెట్టింది. కిష్టుడు ఒక రోజల్లా మనస్సు చిక్కబట్టుకొని చివరకు వాళ్ళమ్మనడిగాడు. "అమ్మా కామయ్యగారు కస్తూరి పిల్లల్ని అందరికీ ఇచ్చేస్తున్నారు. మనం కూడా ఒకటి తెచ్చుకుందామా?" అని.

"ఇంకా నయం! మీ నాన్న వింటే తాట వొలిచేస్తారు" అన్నది మాలక్ష్మమ్మ. కిష్టుడిక ఆ విషయం ఎత్తలేదు.

❀ ❀ ❀ ❀ ❀

ఒకనాడు కిష్టుడు బడినుంచి ఇంటికి వచ్చాడు. బయట నుంచున్నాడు. కస్తూరి కనిపించలేదు. ఆ రోజే వాడు సాహసించి కస్తూరికోసం ఒక పప్పుండ తెచ్చాడు. ఆ రోజు ప్రొద్దున వాడు బళ్ళోకి వెళ్ళేటప్పుడు వాడొక పప్పుండ కొనుక్కొని, కొంచెం కొరికాడు. ఇంతలో కస్తూరి జ్ఞాపకం వచ్చి కొరికిన పప్పుండ జేబులో దాచి ఇంటికి తెచ్చాడు. అందుకోసం నిలబడటం జరిగింది.

చాలాసేపు చూసి విసుగెత్తి కిష్టుడు కామయ్యగారింటోకి వెళ్ళాడు. వరండాలో కస్తూరి కన్నపిల్ల ఒకటి దీనంగా కుంయి కుంయి మంటున్నది. కామయ్యగారు ప్రమిదలో పాలుపోసి దానిచేత తాగించటానికి ప్రయత్నిస్తున్నాడు.

"కామయ్యబాబుగారూ! కస్తూరి ఏదీ?" అన్నాడు కిష్టుడు. పరాయివాళ్ళతో మాట్లాడటం అలవాటు లేని జంకుతో.

"పట్టుకెళ్లారుగా యములవాళ్ళూ?" అన్నాడాయన. కిష్టుడి కర్థంకాలేదు.

"దేనికీ?" అన్నాడు కిష్టుడు.

"ఇంకా దేనికీ? చంపటానికి!... ఈ పిల్ల ఇంకేం బతికి చస్తుంది. పాలుపోస్తే తాగిన పిల్లలన్నిటినీ ఇచ్చేశాను. ఈ వెధవకు పాలు తాగటం చేతకావటం లేదు. ఆ మునిసిపాలిటీవాళ్ళు దీని తల్లిని కాస్తా పొట్టన పెట్టుకున్నారు" అన్నాడు కామయ్య.

"కస్తూరి చచ్చిపోయిందా?"

"చంపితే చావదూ?"

"ఎవరు చంపారు?"

"మునిసిపాలిటీవాళ్ళు."

"ఏం చేసేదీ?"

"ఏం చెయ్యకపోయినా చంపుతారు. లేకపోతే కుక్కలు పెచ్చురేగి బతకనిస్తాయా? అందుకని చంపేస్తారు."

"మంచి కుక్కల్ని కూడా చంపేసేస్తారా?"

"కుక్కలకి మంచేమిటి? చెడేమిటి?"

❋ ❋ ❋ ❋ ❋

కిష్టుడికి ఏమయిందో తెలీదు. ఆ రోజునుంచీ వాడు మారాడు. ఏది కనిపిస్తే దాన్నల్లా చంపేస్తాడు. గోడమీది పిల్లుల్నీ, మిడతల్నీ, నేలమీది చీమల్నీ, చెట్లమీది తొండల్నీ, నీళ్ళ దగ్గిర కప్పల్నీ బతకనివ్వడు. వాడు చూస్తుండగా వాళ్ళమ్మ తేళ్ళను పట్టుకుంటే చంపేస్తాడు. నల్లుల్ని వేటాడతాడు.

ఇది చూసి వాళ్ళమ్మ విస్తుపోతుంటే, వాడిప్పుడు వాళ్ళమ్మ మాటా, తండ్రి మాటా కూడా లక్ష్యం చేయడు. ఒకసారి వాళ్ళ నాన్న కొట్టవచ్చేప్పటికి వాడు చేతిలో ఉన్న పలక తండ్రి మొహాన కొట్టాడు. ఆయన మొహం అంతమేర కోసుకుపోయింది.

ఈ మార్పు వచ్చిన తరువాత కూడా కొంతకాలం వాడు కస్తూరిని తలుచుకుని చాటుగా ఏడిచేవాడు. కాని ఇప్పుడు వాడికి కస్తూరి జ్ఞాపకంరాదు. వస్తే విచారం కూడా లేదు. వాడి అంతరాత్మకు కావలసింది అదే గామాలు!

***మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, డిసెంబర్ 1949***